అభివృద్ధి పథంలో..



నాడు

శ్రీనివాస్‌నగర్‌లో శిథిలమైన రోడ్డు



నేడు

శ్రీనివాస్‌నగర్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



నాడు

ములగాడలో ప్రధాన కాలువ నిర్మాణానికి ముందు పరిస్థితి



నేడు

రూ.80 లక్షలతో నిర్మించిన ప్రధాన కాలువ

- 58 వార్డులో రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి
- మరో రూ.10 కోట్లతో త్వరలో పనులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు రూపురేఖలు మారాయి. అభివృద్ధి పనులతో ప్రగతిబాట పట్టింది. 2019కి ముందు.. ప్రస్తుతం ఈ వార్డు పరిస్థితి చూసిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.14 కోట్లతో వివిధ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు చేయడంతో వార్డు ప్రజల కష్టాలు తీరాయి. నియోజక వర్గం పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఇచ్చిన మాట ప్రకారం ఈ వార్డులో అభివృద్ధి పనులు జరగడంతో ఆయన్ను అంతా అభినందనలతో ముంచెత్తుతున్నారు. ప్రస్తుతం రూ.10 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

2021 నుంచి 2023 ఆగస్టు వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనులు

ప్రాంతం	పూర్తి చేసిన పని	నిధులు
గుల్లలపాలెం	ప్రధాన డ్రైన్	రూ.1.50 కోట్లు
ములగాడ	అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్	రూ.1.20కోట్లు
గొందేశివానిపాలెం	బీటీ రోడ్డు	రూ.25 లక్షలు
ఎదురవానిపాలెం	సీసీ రోడ్డు	రూ. 80 లక్షలు
గొందేశివానిపాలెం	కమ్యూనిటీ హాల్	రూ.18.2 లక్షలు
ములగాడ	కమ్యూనిటీ హాల్	రూ. 35 లక్షలు
శ్రీనివాస్‌నగర్ నుంచి శ్రీహరిపురం వరకు	సీసీ రోడ్డు నిర్మాణం	రూ. 75 లక్షలు
ఉప్పరకాలనీలో	సీసీ రోడ్డు నిర్మాణం	రూ.52లక్షలు
నిర్మాణానికి ములగాడ, ఎదురవానిపాలెంలో..	శ్మశానవాటికల అభివృద్ధి	రూ.52 లక్షలు
ములగాడ, పిలకవానిపాలెం, గుల్లలపాలెంలో..	స్మార్టు స్కూల్స్ నిర్మాణానికి	రూ.3.3కోట్లు



నాడు

అధ్వానంగా ఉన్న ఎదురవానిపాలెం మార్గం



నేడు

రూ.80 లక్షలతో బీటీ రోడ్డు వేసిన తర్వాత ఇలా..

పశ్చిమను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..



పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయిలతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు వార్డుల్లో కోట్ల రూపాయితో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశాం. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. మిగిలిన నియోజకవర్గాల కంటే పశ్చిమలోనే ఎక్కువ నిధులు కేటాయించి పనులు చేస్తున్నాం. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 58వ వార్డు పరిధి ప్రజలు చెప్పిన సమస్యలను 60 శాతం వరకు పూర్తి చేశాం.మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తాం.

–ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

హామీలు నెరవేర్చుతున్నాం



కార్పొరేషన్ ఎన్నికల ప్రచార సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో నెరవేర్చుతున్నాం. గడిచిన కాలంలో రూ. 14 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసి చూపించాం.మరిన్ని పనులు త్వరలో ప్రారంభిస్తాం.

–గులిగిందల లావణ్య, కార్పొరేటర్,58వ వార్డు

ఇలా అయితే నడిచేదెలా!



శ్రీహరిపురం ప్రధాన మార్గంలో వేసిన కాంక్రీట్ పిక్క

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ వద్ద ఓ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఇక్కడ సర్వీసు రోడ్డుపై అడ్డంగా కాంక్రీట్ పిక్క డంప్ చేయించాడు. సర్వీసు రోడ్డు సగం మూసి వేసినట్టు ఉండడంతో రాకపోకలు సాగించే వారితో పాటు వాణిజ్య దుకాణాల్లోనికి ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో శనివారం ఉదయం ఈ మార్గంలో పాదచారులు,వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

15న సమరయోధుల వారసులకు సత్కారాలు

సీతమ్మధార: దేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వందే విశ్వభారత్ వీర పురస్కార్ పేరిట స్వాతంత్ర్య సమరయోధుల వారసులను సత్కరించనున్నట్లు సంస్థ చైర్మన్ బలివాడ రమేష్, ఎండీ భీమరశెట్టి వాసుదేవ్ తెలిపారు. సీతమ్మధార ఏఎస్సార్ నగర్‌లోని కార్యాలయంలో శనివారం మీడియాతో వారు మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ ఎదురుగా ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 120 మంది స్వాతంత్ర్య సమరయోధుల వారసులను వేదికపై సన్మానిస్తామన్నారు. 300 అడుగుల జాతీయ జెండాతో బీచ్ రోడ్డులో ఫ్లాగ్ మార్చ్ జరుగుతుందని, యువత, విద్యార్థులతోపాటు నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రచయిత్రి డాక్టర్ జలాది విజయ, సుశీల, కిశోర్, విజయరమణి, లంక రమ్య, రాధ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు



లలిత పారాయణ చేస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని కృష్ణాలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా శ్రీవిజ్ఞాన మండలి యాదవ్ సంఘం పాలక సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గ మహిళలు పాల్గొని కృష్ణుడి ఉత్సవ విగ్రహానికి పాలు, పెరుగులతో అభిషేకాలు చేశారు. అనంతరం లలిత పారాయణం, గోవింద నామాలను పఠించారు. కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని కృష్ణయ్యను దర్శించుకుని పూజలు జరిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం పాలక వర్గ ప్రతినిధులు, సభ్యులు, కుల పెద్దలు, సలహాదారులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



విన్సెంట్ కుటుంబ సభ్యులకు నగదు సాయం చేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు సెబాస్టియన్ కాలనీలో నివాసముంటున్న సురుపిల్లి విన్సెంట్ శుక్రవారం రాత్రి మరణించారు. మరణవార్త తెలుసుకున్న వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ శనివారం అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు విన్సెంట్ కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా త్వరితగతిన అందేట్లు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణిరావు, ఈశ్వరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు టీడీపీ కాలనీలో పాడైన తాగునీటి పైప్‌లైన్‌కు శనివారం మరమ్మతులు చేపట్టారు. ఈ పైప్‌లైన్ దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్వయంగా టీడీపీ కాలనీకి వెళ్లి తాగునీటి విభాగం సిబ్బందిని పిలిపించి పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో తమ వార్డులోని సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం వార్డులో జరగబోయే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కాలనీ సమస్యలపరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. నాయకులు రామకృష్ణ, నక్కా సూర్యనారాయణ పాల్గొన్నారు.

రెప్కో బ్యాంక్‌లో కొత్త పథకాలు

గోపాలపట్నం: భారత ప్రభుత్వ సంస్థ రెప్కో బ్యాంక్ నూతనంగా కోడిపాజిట్ పథకాలు అందుబాటులోకి తీసుకువచ్చిందని బ్యాంక్ చీఫ్ మేనేజర్ రిషి ఒక ప్రకటనలో తెలిపారు. రెప్కో 400, రెప్కో12 డిపాజిట్‌లను ప్రవేశ పెట్టామని తెలిపారు. ఈ పథకాల్లో సీనియర్ సిటిజన్స్, జనరల్ సభ్యులకు అత్యధిక వడ్డీ లభిస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు అమల్లో ఉంటాయన్నారు.

శ్రావణ మాసోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మర్రిపాలెం: ఈ నెల 17 నుంచి బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రావణ మాసోత్సవాల బ్రోచర్‌ను శనివారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 58వ వార్డు మర్రిపాలెం రాణాప్రతాప్ నగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల పాటు అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఏడీ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం మాట్లాడుతూ నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక కుంకుమ పూజలు, లక్ష్మీ హోమంలో పాల్గొనే భక్తులు రూ.400 రుసుం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ధర్మకర్తలు ధర్మకర్తలు బెహర వెంకటరత్నం, మళ్ల ధనలత, బుద్ధల అనురాధ, సత్యవరపు సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సానబోయిన సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మర్రిపాలెం: ఈ నెల 14న అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళింగనగర్‌లోని అసోసియేషన్ కార్యాయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అపోలో ఆస్పత్రి వైద్యులు బీపీ, సుగర్, కీళ్ల నొప్పులు, హృద్రోగ, ఈసీజీ, బీఎంఐ, 2డీ ఈకో వంటి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అసోసియేషన్ సభ్యులు, పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేల బావిలో మురుగునీరు తొలగింపు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు యాదవవీధిలోని నేల బావిలో వ్యర్థాలను శనివారం తొలగించారు. బావి శిథిలం కావడంతో స్థానికులు డంపింగ్ యార్డుగా మార్చేశారు. దీంతో వ్యర్థాలు కుళ్లి దుర్వాసన రావడంతో సమస్యను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇటీవల ఆమె బావిని పరిశీలించి వ్యర్థాలు తొలగించాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. ఆమె సూచనల మేరకు నేల బావిలో ఉన్న వ్యర్థాలతో పాటు నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. ఆది,సోమవారాల్లో కూడా బావిలో ఉన్న వ్యర్థాలను తొలగించే చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. దీంతో యాదవ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రసవత్తరంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం స్టూడెంట్స్ బాల్ బ్యాడ్మింట్ క్లబ్ ఆధ్వర్యంలో జి. శ్రీనివాస్, పి. దివాకర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న రెండు తెలురాష్ట్రాల బాల్ బాడ్మింట్ పోటీలను శనివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు సేవలు అందించిన మంచి క్రీడా కారుల జ్ఞాపకార్థం పోటీలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. తొలి రోజు పోటీలు రసవత్తరంగా సాగాయి.నిర్వాహకుడు ఎస్ఎస్ ప్రకాష్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 21 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. 5 జట్లకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతిగా రూ.20వేలు, మూడో బహుమతిగా రూ.15వేలు, నాలుగో బహుమతిగా రూ.10వేలు, 5వ బహుమతిగా రూ.5వేలు అందించనున్నట్టు చెప్పారు. క్రీడాకారులకు వైద్య సేవలు అందించడానికి బెహరా ఆస్పత్రి సిబ్బంది స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టూడెంట్ బాల్ బాడ్మింటన్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పి. రమణ, ఉపాధ్యక్షులు రామ్‌గోపాల్, ప్రభూజీ, పి. రంగారావు, కోశాధికారి ఎస్. కొండలరావు, ఏసీపీ వెంకటరావు, గోపాలపట్నం క్రైం ఎస్ఐ నర్సింగరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అమరులకు ఘన నివాళి



స్వర్గీయ అనుకుష్‌శర్మ, చందక గోవింద్ స్మారకాల వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేవీ అధికారులు

సింధియా: శౌర్య దివాస్‌ను పురస్కరించుకుని ఐఎన్ఎస్ కర్ణలోని శౌర్యస్థలం వద్ద తూర్పు నావికాదళం తరపునన కమాండర్ సీఎస్ నాయర్ మార్కోస్ బ్రేవ్ హార్ట్స్‌కు ఘన నివాళులర్పించారు. మార్కోస్ బ్రేవ్ హార్ట్స్ జ్ఞాపకార్థం ఆపరేషనల్ క్యాజువాలిటీగా మారిన శౌర్య స్థలాన్ని సందర్శించిన పలువురు అనుభవజ్ఞులు వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మార్కోస్ బ్రేవ్ హార్ట్స్‌గా పిలువబడే స్వర్గీయ అనుకుష్‌శర్మ, స్వర్గీయ చందక గోవింద ఇద్దరూ 2023 మధ్యలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీరులు. వీరి స్మారకాల వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామ్ ఆచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యానారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం భక్తి సంకీర్తన, నక్షత్ర హారతి నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్ శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

తాళం వేయడం మరిచారు!



సాయంత్రం 5.30 గంటల సమయంలో తాళాలు వేయకుండా ఉన్న సచివాలయం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో సచివాలయం (1086331)ఉంది. ఆ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చేందుకు ఇక్కడ సచివాలయాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే రెండో శనివారం కావడంతో సచివాలయానికి బీఎల్ఎఫ్‌లు ఇద్దరు తప్పా మిగిలిన స్టాఫ్ రాలేదు. వీరిద్దరూ మధ్యాహ్నం 3.30 గంటల వరకు తమ తమ పని చేసుకుని వెళ్లిపోయారు. అయితే సచివాలయానికి తాళాలు వేసి వెళ్లాల్సి ఉంది. తాళాలు లేవో.. మరిచి పోయారో తెలియదు కానీ తాళాలు వేయలేదు. సాయంత్రం 5.30 గంటలు దాటినా సచివాలయం తెరిచి ఉండడంతో సచివాలయం పక్కన గల వాటర్ ప్లాంట్ సిబ్బంది వచ్చి చూస్తే ఎవరూ లేదు. దీంతో వారు అక్కడ ఉన్న తాళాలు వేశారు. దీనిపై సచివాలయ అడ్మిన్ సుధీర్‌నాయక్‌ను వివరణ కోరగా బీఎల్ఎఫ్‌లు తాళాలు వేశారని, తాళాలు వేసే తలుపు గడియ చాలా వదులుగా ఉందన్నారు. ఎవరైనా లాగినా అది వచ్చేస్తుందని చెప్పారు. ఈ సమస్యను జోన్–4 జెడ్సీ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



పోతురాజును సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి తదితరులు

గోపాలపట్నం: గోపాలపట్నం శాఖ గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ పుస్తకం జ్ఞానాన్ని అందించే సాధనమన్నారు. అందుకే గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా పేరు తెచ్చుకున్నాయన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి అందరి సహకారాలు అవసరమని కోరారు. పాఠకుల సౌకర్యం కోసం వారికి అవసరమైన పుస్తకాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల పదవీ విరమణ పొందిన జిల్లా కేంద్ర గ్రంథాలయ గ్రంథపాలకుడు కె.పోతురాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన అధికార ప్రతినిధి కొండా రాజీవ్, రాష్ట్ర పింఛన్ దారుల సంఘం అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు, గోపాలపట్నం శాఖా గ్రంథాలయ అధికారి ఎస్.వి. నరసింహం, గ్రంథపాలకులు పి.వి.ఎస్.రాజు, జయ్‌కుమార్, రాజేంద్ర వర్మ, బి.సూర్యకళ, వి.కె.శిరీష, పి.వి.రమణ, బి.చంద్రకళ, బి.వి.ఎస్.అప్పారావు, తిరుమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అమానుషం



శాంతి ర్యాలీ చేస్తున్న జాన్‌వెస్లీ, రేవతి డేవిడ్‌రాజు, ప్రీచర్స్ ఫెలోషిప్ సభ్యులు

మురళీనగర్/కంచరపాలెం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను క్రిస్టియన్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనిపై వీరు విశాఖ చర్చెస్ ఆఫ్ క్రైస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ బిర్లా కూడలి నుంచి కప్పరాడ జంక్షన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేవతి డేవిడ్‌రాజు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి అమానుషమని, దీనిపై ప్రతి మహిళ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో మానవత్వాన్ని కాపాడాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులంతా దారిపొడవునా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చర్చెస్ ఆఫ్ క్రైస్ట్ ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్ మాణిక్యాలరావు, కార్యదర్శి శంకర్ డానియేలు, రామరాజు, నవీన్, విక్టర్ రాజు, పలువురు పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

స్థానికులకే ఎంపీ సీటు కేటాయించాలి

సీతంపేట: ఏ రాజకీయ పార్టీ అయినా స్థానికులకే ఎంపీ అభ్యర్థి సీటు కేటాయించాలని మాజీ వీసీ, యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎవరు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇప్పటి వరకు 20 లక్షల కోట్ల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని, బయట నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులే ఈ పని చేశారని ఆరోపించారు. 1991 నుంచి స్థానికేతరులే విశాఖ ఎంపీగా ఎన్నికవుతున్నారని తెలిపారు. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ స్థానిక నాయకులు లేక ఇక్కడి సమస్యలపై ఎవరిని సంప్రదించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుల అవసరముందని, లేదంటే భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రొఫెసర్ అల్లు గౌరీశంకర్ మాట్లాడుతూ రెండు సామాజిక వర్గాలే రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, స్థానికేతరులు దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నారే తప్ప.. ఇక్కడి ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు, మాజీ జిల్లా జడ్జిలు పి.ముత్యాలనాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అరసం కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి అమ్మవార్లకు స్వర్ణపుష్పార్చన



స్వర్ణ పుష్పార్చన చేస్తున్న భక్తులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం అంగరంగ వైభవంగా జరుగుతోంది. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ, రిత్వికుల వేద మంత్రాల మధ్యం శాస్త్రోక్తంగా అష్టలక్ష్మీ మహాయాగం, స్వర్ణపుష్ప అర్చన, అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ జరిపించారు. అమ్మవార్లకు భక్తులు స్వర్ణపుష్పార్చన చేసి, యాగంలో పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.